విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 23, మార్చి 2025

24న కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి ద్వితీయ వర్ధంతి

మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-యాడికి : మార్చి 24వ తేదీన దివంగత కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మండలంలోని వేములపాడు గ్రామంలో రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమానికి వీకే అభిమానులు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-యాడికి : పెద్దవడుగూరు మండల కేంద్రంలోని ప్రధాన కూడలి, గాంధీ విగ్రహం వద్ద శనివారం స్వాతంత్ర సమరయోధులు సిపిఐ సీనియర్ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, పాదచారుల సౌకర్యార్థం మినరల్ వాటర్ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగిరెడ్డి, ఈశ్వరప్ప, కృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సత్యహరిచంద్ర నాటకం

విశాలాంధ్ర-పామిడి : పామిడి పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన సత్యహరిచంద్ర రంగస్థలం పౌరాణిక నాటకం ప్రజల హృదయాలను రమ్మింపజేసింది. రాష్ట్ర సృజనాత్మక సమితి భాషా సాంస్కృతిక శాఖ వారి సహాయ సహకారంతో స్థానిక స్వరరాగ నాటక కళాసమితి ఉచిత శిక్షణాలయం వారిచే సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం జన రంజకంగా సాగింది. కళాకారులందరూ పోటాపోటీగా వారి వారి నటన చాతుర్యం, మధుర గానంతో నాటకాన్ని రక్తి కట్టించారు. శాంతి భద్రతలకు లోటు జరగకుండా సిఐ యుగంధర్ పరిరక్షణ కల్పించారు. నరహరి దేవరాజు రమణమూర్తి ఆంటోని నారాయణరెడ్డి పుంజా. కృష్ణారావు బెస్త సుబ్రహ్మణ్యం, నరేంద్ర, అనిత కుమారి, నాగమణి తదితర కళాకారులు నటించగా, అంజనేయ బాబు ఆనంద్ ప్రభాకర్ శివకృష్ణ సంగీత వాయిద్యములు అందించారు.

గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని కాపాడండి ..

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ హరిజన గాంధీ హాస్టల్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ శనివారం స్థానిక దళిత కులానికి చెందిన ఆరు మెట్ల కాపురస్తులు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కుల పెద్దలు మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో సర్వేనెంబర్ 533, బి 533సిలో 2.67 ఎకరాల హరిజన గాంధీ హాస్టల్ స్థలంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్వార్థపరులు వివిధ కమిటీల పేర్లతో ఎంతో విలువైన హాస్టల స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని దీనిని అడ్డుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎంతో విలువైన హాస్టల్ స్థలాన్ని కాపాడాలని అలాగే అక్రమ రిజిస్ట్రేషన్‌ని కూడా రద్దుచేసి దళిత కులాలకు ఉపయోగపడే కాంప్లెక్సు కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

ఫారం ఫండ్‌కు భూమి పూజ

విశాలాంధ్ర- శింగనమల : మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో ఫారం ఫండ్‌కు సర్పంచ్ దేగల లలితమ్మ జిల్లా టీడీపీఅధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ తెలుగుదేశం నాయకులు దేగల శ్రీనివాసులు, బాలిరెడ్డి మల్లికార్జున, శివయ్య, ఎర్రిస్వామి, బండి ఎర్రిస్వామి పాల్గొన్నారు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

విశాలాంధ్ర-అనంతపురం : సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు పేర్కొన్నారు. అనంత జిల్లా మలేరియా కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి డి ఓబులు అధ్యక్షతన శనివారం జిల్లాలోని మలేరియా సభ్య యూనిట్ అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డి.ఓబులు మాట్లాడుతూ... గతంలో జిల్లాలో 52 ఫైలేరియా కేసులకు మార్బిడిటీ మేనేజ్మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లను మలేరియా సబ్ యూనిట్ అధికారులకు అందించామన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి కే.సత్యనారాయణ మాట్లాడుతూ... జిల్లాలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించి ప్రజలకు కాలానుగుణ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు మలేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధుల నివారణ చర్యలు గురించిన కరపత్రాలను సిబ్బందికి పంపిణీ చేశారు. ఎంపీ హెచ్ఈఓలు కె.గిరిధర్‌రెడ్డి, బత్తుల కోదండరాంరెడ్డి, మద్దయ్య, మునాఫ్, రామకృష్ణ, నాగేంద్రప్రసాద్, రమేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతకు భూమి పూజ



విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండలంలోని దొడగట్ట గ్రామంలో ఓ రైతు పొలంలో శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా రైతు పొలంలో ఇంకుడు గుంత కు భూమి పూజచేసి పనులను మండల అధికారులు ప్రారంభించారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు , మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ బోయ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతు స్టోరేజ్ నీటిని అరి కట్టడంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దాసనాయక్, ఏపీవో ఓబన్న, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ బోయ రామాంజనేయులు, ఈసీ రవి పాల్గొన్నారు.

అందరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి..

▸ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నప్ప యాదవ్

విశాలాంధ్ర-శింగనమల : మండల పరిధిలోని నాగలగుడ్డం తండా సీపీఐ గ్రామ కమిటీ సమావేశం శనివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నప్ప యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపశువులకు, గొర్రెలకు, మేకలకు, కోళ్ళ పెంపకానికి, చేతివృత్తులకు, కిరాణా వ్యాపారాలకు, చిన్న తరహా వ్యాపారులకు అన్నివర్గాల నిరుపేదలకు బ్యాంకులు సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ప్రయివేటు వ్యక్తుల దగ్గర, మైక్రో ఫైనాన్స్‌ల దగ్గర అధిక వడ్డీలకు తీసుకొని రుణాలు కట్టలేక పేద మధ్యతరగతి వ్యాపారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైక్రో ఫైనాన్స్ అధికారులు రుణాలు కట్టాలని ఇళ్ల దగ్గరకు వచ్చి ఒత్తిడి చేయడం వల్ల చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మైక్రో ఫైనాన్స్‌ల పైన కఠిన మైనచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో పాడి పశువులు అంతరించిపోయి కల్తీపాల వ్యాపారుల అగడాలు మితిమీరిపోయాయన్నారు. నాబార్డు ద్వారా, పీఎంజీబీ ద్వారా అర్హులందరికీ బ్యాంకులతో సమన్వయం చేసి రుణాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నూతన గ్రామ కమిటీ శాఖా కార్యదర్శి జయరాం నాయక్, సహాయ కార్యదర్శులు మున్యానాయక్, వేంకటేష్ నాయక్ 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మధుయాదవ్, చేనేత మధు, మునిస్వామి, రూప్లానాయక్, మంగమ్మ, నాగమ్మ, లక్ష్మక్క గమ్మాబాయి, రామాంజి నాయక్, దేవమ్మ, చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పోరాట ఫలితమే చింతలపల్లి..వజ్రకరూర్ రోడ్డు

విశాలాంధ్ర-గుంతకల్: గుంతకల్ సిపిఐ మండల పార్టీ పోరాట ఫలితంగా 4 సంవత్సరాలుగా చింతలపల్లి నుంచి వజ్రకరూర్ వరకు నిలిచిపోయిన రోడ్డును కలెక్టర్ వినోద్ కుమార్ స్పందించి రోడ్డును వేయించారు. గుంతకల్ పట్టణంలో 28-10-2024 సంవత్సరంలో టీటీడీ కల్యాణ మండపంలో కలెక్టర్ స్పందన కార్యక్రమంలో సిపిఐ ఆధ్వర్యంలో మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పి.రాము రాయల్, మాట్లాడుతూ, చింతలాంపల్లి గ్రామం నుంచి వజ్రకరూర్ వరకు రోడ్డు పనులను కాంట్రాక్టర్ గ్రావెల్ రోడ్డు పనులను 4 సంవత్సరాలు అవుతున్న రోడ్డు వెయ్యలేదు. సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించి ప్రజలు, రైతులు, విద్యార్థులు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన కలెక్టర్ ఈ నెల 16వ తేదీన చింతలాంపల్లి గ్రామం నుంచి వజ్రకరూరు వరకు నిలిచిన రోడ్డు పనులను పూర్తి చేయించారు. ఈ మేరకు సిపిఐ మండల పార్టీ ప్రజలందరి తరఫున కలెక్టర్ వినోద్ కుమార్ కి, గుంతకల్ మండల ఇంజనీర్ ఓబులేసుకి అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా మిగిలి పోయిన రోడ్లను కూడా ఆర్ అండ్‌బి అధికారులు పూర్తి చేయాలని కోరారు. సిపిఐ పోరాటాలు చేయడం ద్వారా ఏదైనా సాధించవచ్చని అన్నారు. అదేవిధంగా రాగులపాడు దగ్గర పిల్ల కాలవ ఏర్పాటు చేసి ధోనిముక్కల నుంచి పామిడి మండలాల వరకు ఉన్న చెరువులన్నింటికీ నీరు అందించి కాలువకు నిధులు విడుదల చేసి వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో రైతులను, ప్రజలను కలుపుకొని పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

ఐదెకరాలలోపు ప్రతి రైతు ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవాలి

లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర.కూడేరు : మండల పరిధిలోని జయపురం గ్రామంలో శనివారం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, పర్యటించి ఫారం పౌండ్‌కు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఐదు ఎకరాల లోపల ఉన్న ప్రతి రైతు ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద కూడేరు మండలం చోళ సముద్రం గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి పొలంలో ఫారం పాండ్ ఏర్పాటుకు సంబంధించి భూమి పూజ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చోళ సముద్రం గ్రామానికి గాను మొత్తం 21 ఫారం పాండ్‌లకు అనుమతి లభించాయని, వీటిలో మూడు పనులను పూర్తి చేశామని, 7 పనులు వివిధ దశలలో పనులు జరుగుతున్నా యని, 11 పనులను ప్రారంభించవలసి ఉన్నాయని తెలిపారు. ఐదు ఎకరాలలోపల ఉన్న వంటి ప్రతి రైతు ఫారం ఫండ్స్ ను ఏర్పాటు చేసుకోవాలని, అదే ఆ విధంగా ప్రతి రైతుకు అవగాహన కల్పించి వారి ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా 5 ఎకరాల కంటే తక్కువ ఉన్న వారికి కూడా ఫారం పాండ్స్ ఏర్పాటకు ముందుకు వస్తే దానికి వీలుగా అనుమతులు తీసుకొని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంత మంతా పల్లపు ప్రాంతం కావడం వర్షాకాలంలో వర్షపునీరు వృధాగా పోకుండా నీటి నిల్వకు ఫారంపండ్ ఉపయోగపడు తుందని, అలాగే బోర్లలో నీటి శాతం వృద్ధి బోర్లు రీఛార్జ్ అయ్యేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ తిప్పే నాయక్, డ్వామా పీడీ సలీమ్ భాష, తహసిల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో కుళాయి స్వామి, ఈఓఆర్డి రాధాకృష్ణ, రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్, ప్రసాద్,ఏపీఓ తులసి ప్రసాద్, సెక్రటరీ సుభాషిని, సర్పంచ్ రమాదేవి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మురళి, సర్పంచ్ భర్త వడ్డే రాజప్ప తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నీరే సర్వ జీవులకు ఆధారం

విశాలాంధ్ర-గుంతకల్లు : సర్వ జీవులకు నీరే ఆధారమని దేవుడు వర్షం రూపంలో ప్రసాదించిన ప్రతి బొట్టును ఒడిసి పట్టాలని ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. అంతర్జాతీయ జల సంరక్షణ దినోత్సవంలో భాగంగా శనివారం ఆయన మల్లేనిపల్లి గ్రామంలో ఫారం పాండ్‌కు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టి భూమిలో ఇంకిపోయేలా చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరగడం వల్ల వృక్ష సంపద పెరిగి మనుషులకు ఆదాయం, ఆరోగ్యం పెంచుతుంది అన్నారు. ఒక ఫారం పందు వర్క్‌కు 1,39,000 ప్రభుత్వం ఖర్చు చేస్తుందంటే ఆ పని ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాల్మీకి మాధవి, జెడ్పిటిసి మెంబర్ కదిరప్ప, సర్పంచ్ ఉరవకొండ శ్రీరాములు, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండర్ ఆనందు, నాయకుల మస్తానప్ప, లాయర్ కృష్ణారెడ్డి, చిప్పిగిరి ప్రతాప్, పాలు మల్లికార్జున, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి లింగరాజు, డిఎల్‌డిఓ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి, ఏపీవో కృష్ణమూర్తి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి జీవనాడి

విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం: ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి జీవనాడి అని కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ త్రివేంద్రం(కేరళ) పేర్కొన్నారు. శనివారం అనంతపురం పట్టణంలోని రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాలలో 1980లో విద్య నభ్యసించిన కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ ఏర్పాటు మేనేజర్ త్రివేంద్రం చొరవతో కెనరా బ్యాంక్ సాయినగర్ బ్రాంచ్ సౌజన్యంతో రూ.3 లక్షలు విలువచేసే కంప్యూటర్స్, సిసి కెమెరాలు, ప్రింటర్స్, జిరాక్స్ మిషన్స్, కంప్యూటర్ టేబుల్స్, బీరువా, మైక్ సెట్, ఫాన్స్, స్పోర్ట్స్ మెటీరియలు ప్రిన్సిపల్ రేణుకాకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో బోధించిన అధ్యాపకులతో ఉన్నత స్థానంలో ఉన్నామన్నారు. విజ్ఞానం, అధ్యయనం, వినోదం, వికాసానికి నిలయం పాఠశాలల్లోనే అన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ లారెన్స్, బ్యాంకు మేనేజర్ శ్రీనాథ్ నాయక్, బ్యాంకు సిబ్బంది రమేష్ బాబు, ఉపాధ్యాయులు ఎస్.రామాంజనే యులు, ఓబులేసు గాంగే నాయక్, దేవ కుమారి, జయరాం నాయుడు, రాజన్న, విరూపాక్ష గౌడ్, యుగేందర్ పాల్గొన్నారు.

మూడేళ్ల చిన్నారి మృతిపై తక్షణమే విచారణ చేపట్టాలి..

విశాలాంధ్ర -రాయదుర్గం : పట్టణంలోని ఆర్ఎంపి వైద్యం వికటించి మూడేళ్ల చిన్నారి మృతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం ఏఐవైఎఫ్ ఎస్ఎఫ్ఐమూస క్లినిక్ ఆర్ఎంపీ డాక్టర్ వైద్యం వికటించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి డిమాండ్ చేశారు. రాయదుర్గం పట్టణంలో ఆర్.ఎం.పి డాక్టర్ల లైసెన్స్ వారి కేంద్రాలను తనిఖీ చేసి అనర్హులను గుర్తించి చర్యలు తీసుకోవాలని అర్బన్ సిఐ జయ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు కోట్రేష్ సిపిఐ తాలూక కార్యవర్గ సభ్యులు నరసింహులు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శివ మాట్లాడుతూ రాయదుర్గం తాలుక గుమ్మగట్ట మండలం గలగల గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారికి జ్వరం రావడం తో తల్లిదండ్రులు మూసా క్లినిక్‌లో వైద్యం చేయించారని, బ్లడ్‌టెస్ట్ చేసిన అనంతరం టైఫాయిడ్ జ్వరమని సెలైన్ ఇంజక్షన్లు వేయడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందిం దన్నారు. ఆ చిన్నారికి జ్వరం విపరీతం అవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని ఆర్ఎంపి వైద్యుడు సూచించారు అప్పటికే ఆ చిన్నారి మృతి చెందిందని ప్రభుత్వ వైద్యులు చిన్నారి మృతి చెందిందని నిర్ధారించగా బోరున విలపిస్తూ మూసా క్లినిక్ వద్ద ఆందోళన చేపట్టారు. వారికి మద్దతునిస్తూ సిపిఐ సిపిఎం ఏఐవైఎఫ్ ఎస్ఎఫ్ఐ క్లినిక్ ఎదుట నిన్న రాత్రి ధర్నా నిర్వహించారు రాయదుర్గం గుమ్మగట్ట కనేకల్ హీరేహాళ్ మండలాల్లో కొన్ని నెలల నుండి ప్రజలు చిన్న పిల్లలు మహిళలు ఆర్ఎంపీ డాక్టర్ల వైద్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్ఎంపీ డాక్టర్లు సెలైన్లు పెట్టడం ఇంజక్షన్స్ వేయడం పరిమితికి మించి వైద్యం చేయడం లాంటి పనులు చేయకూడదని పలుమార్లు వారికి చెప్పిన వారే ఒక ఎంబిబిఎస్ డాక్టర్‌గా అన్ని రకాల వైద్యం చేస్తూ ప్రజల మృతికి కారకులవుతున్నారు. వారికి మెడిసిన్ ఎక్కడి నుంచి వస్తుంది ఎవరు సప్లై చేస్తున్నారు విచారణ చేపట్టాలన్నారు. ఆర్ఎంపీలను కట్టడి చేయాలని, ప్రభుత్వ హాస్పిటల్‌కు లేదా ఎంబిబిఎస్ చేసిన వైద్యుల దగ్గరికి వెళ్లేలా ప్రజలకు అవగాహన పోలీసులను కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాయదుర్గం తాలూక అధ్యక్షులు కుమార్ జిల్లా సమితి సభ్యులు నాగయ్య శంకర్ సురేష్ మారేష్ వలి పాల్గొన్నారు

ఇంజనీరింగ్‌లో మైనర్, హానర్ డిగ్రీ అమలు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : ఇంజనీరింగ్‌లో ప్రతి విభాగంలోను మైనర్, హానర్ డిగ్రీ కోర్సు అమలకు వీసీ ఆచార్య హెచ్.సుదర్శన్‌రావు ఆమోదముద్ర వేశారు. శనివారం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం ఆన్లైన్‌లో సమావేశంలో బీ.టెక్ మూడవ, నాలుగవ సంవత్సరానికి కావలసిన పాఠ్యాంశాల తయారీపై సమావేశం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. 2023లో న్యూ ఎడ్యుకేషన్ పాలసీకి అనుగుణంగా మార్పులు చేపట్టామన్నారు. ఏదైనా విద్యార్థి 18 క్రెడిట్లు ఎక్కువగనక చదివితే ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు మైనర్స్, హానర్స్ ఇస్తామని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్‌లో మైనర్ చేయదానికి అనుమతి ఉంటుందని 40 శాతం క్రెడిట్స్ ఆన్‌లైన్‌లో చదువుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఐదు రోజులు వర్క్ షాపు, ప్రతి సెమిస్టర్‌లోను ఎక్స్ పర్ట్ లెక్చర్, క్రెడిట్ డిపాజిట్ ఆమోదం ప్రతి విద్యార్థి ఫైనల్ ఇయర్ రెండవ సెమిస్టర్ లో ఇంటన్ షిప్, మూడవ సెమిస్టర్ సమ్మర్ బ్రేక్ లో ఇంటన్ షిప్ చేయవలసి ఉంటుందని తెలిపారు.

23న సిపిఐ బహిరంగ సభ విజయవంతం చేయండి

ముఖ్య అతిథులుగా హాజరుకానున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ.

విశాలాంధ్ర-కూడేరు : నరేంద్రమోడీ అనుసరిస్తున్న మితవాద, మతోన్మాద కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ రాజ్యాంగ పరిరక్షణకై సిపిఐ ఆధ్వర్యంలో 23న నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయా లని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి కేశవరెడ్డిపిలుపు నిచ్చారు శనివారం కూడేరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడి ప్రభుత్వం తన ఆర్.ఎస్.ఎస్ అనుకూల సిద్ధాంతాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు పావులు కదుపుతోందని మండిపడ్డారు. దేశంలో ప్రాంతాల మధ్య మతాల మధ్య విద్వేశాలను రెచ్చగొడుతోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించి వేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే వారిపై అర్బన్ నక్సలైట్లు అని ముద్రవేస్తూ ప్రజాస్వామిక విలువలను అణిచివేస్తోందన్నారు. దేశాన్ని కార్పొరేట్ చేతుల్లోకి పెట్టేందుకు వారికి అనుకూల మైన చట్టాలను తీసుకొస్తోందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల పేద ప్రజల మరింత పేదవారిగా, ధనవంతులు మరింత ధనవంతులుగా అవుతున్నారన్నారు రైతుల ఆశయాలను రెట్టింపు చేస్తామని బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల అప్పులు పెరిగి పంటలు గిట్టుబాటు ధరలు లేక అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారన్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారు. సిపిఐ దేశవ్యాప్తంగా సర్దార్ భగత్సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని మార్చి 23 తేది నుండి ఏప్రిల్ 14వ తేది వరకు ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. మార్చి 23వ తేది (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు లలిత కల పరిషత్ వద్ద రైతు బజార్ నుంచి ర్యాలీగా అనంతపురం నగరంలోని కె.ఎస్.ఆర్. జూనియర్ కాలేజి ఎదుట బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటుందన్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ పాల్గొంటా రన్నారు. అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల పార్టీ కార్యదర్శి నారాయణమ్మ సీపీఐ నాయకులు బి.రమణ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెరుగు సంగప్ప వ్యకాసం నియోజకవర్గ అధ్యక్షులు మల్ల రాయుడు సిపిఐ నాయకులు ధనరాజు పాల్గొన్నారు.

నీటి బొట్టును ఒడిసిపడదాం

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : ప్రతి నీటిబొట్టును ఒడిసిపెట్టి.. నీటి పొదుపును అమలు చేద్దామని శ్రీ కృష్ణదేవ రాయ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.బి. రవీంద్రనాథ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి నీటి వనరులు మూలాధారమని అన్నారు. వ్యాస రచన పోటీలో విజేతలకి సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు డా.రామకృష్ణ, డా.గోవర్ధన్, సూర్య తేజ, భానురేఖ, ప్రకాష్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం...

విశాలాంధ్ర-గుత్తి : కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిహెచ్ డబ్ల్యు ఒకేషనల్ గ్రూప్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రుద్రాక్షి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు అనాథలు బడి బయటి పిల్లలు పేద తరగతి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఆరవ తరగతిలో 40 సీట్లు ఇంటర్ మొదటి సంవత్సరానికి 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

ముగిసిన అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ..

విశాలాంధ్ర-గుత్తి : ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాలు శనివారం ముగిసాయని అడిషనల్ సిడిపిఓ నాగమణి తెలిపారు.అడిసినల్ సిడిపిఓ నాగమణి మాట్లాడుతూ పిల్లల పోషణ, పౌష్టికాహారం, పిల్లల చదువు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చామని,మూడు రోజుల పాటు శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు నాగేశ్వరి, షాహిదా, గౌరి, పుష్ప, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

విశాలాంధ్ర-అనంతపురం : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం అనంతపురం పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శనివారం తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాక్ బుక్‌లను పరిశీలించారు. కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, తహసీల్దార్ హరికుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, బిజెపి ప్రతినిధి ఈశ్వర ప్రసాద్, కాంగ్రెస్ ప్రతినిధి ఎంఎండి ఇమామ్, వైసీపీ ప్రతినిధి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాజేసిన నిధులను యూనివర్సిటీకి చెల్లించే వరకు పోరాటం

విశాలాంధ్ర బ్యూరో -అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గత వైస్ ఛాన్సలర్ పనిచేసిన ఎం. రామకృష్ణారెడ్డి తన వ్యక్తిగత టూర్ల కోసం యూనివర్సిటీ వాహనాన్ని వాడుకోవడం పాటు యూనివర్సిటీ నిధులను దుర్విని యోగం చేసిన వాటిపై విచారణ చేసి రుజువు అయితే యూనివర్సిటీ ఖాతాలో జమ చేయాలని శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ రిజిస్టర్ రమేష్ బాబుకి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి మాట్లాడుతూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తమ విధులు నిర్వర్తిస్తున్న సమయంలో తమ వాహనానికి రెక్టార్, రిజిస్టర్ తమ కుటుంబ సభ్యులకు కూడా యూనివర్సిటీ వాహనాలను వాడుకోవడం ఎంత వరకు సమంజసమని కుల్లాయి స్వామి ప్రశ్నించారు. కుటుంబ సభ్యులు విహారయాత్రలు తిరిగారని,ఇండ్లలో జరిగిన పెళ్లి శుభ కార్యాలయాలకు వాహనాలు వాడుకున్నారనే ఆరోపణలు వున్నాయని తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండు చేశారు. మూడేళ్ల పదవీకాలంలో డ్రా చేసిన నిధులపైన చేపట్టిన పనులపైన విజిలెన్స్ కమిటీ వేసి ఎంక్వయిరీ చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మోహన్ రఘు, సాయి, వీరేంద్ర, మనోజ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర ఆత్మకూరు : మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామంలో ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి హరిత ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. లైంగిక వేధింపుల నుండి పిల్లల రక్షణ చట్టం 2012 గురించి, వాటి ఉపయోగాలు, వాటిలో ఉన్న ప్రధాన అంశాల గురించి, నల్సా శక్తి దిశ యాప్‌ల గురించి వివరించారు. అబ్బాయిలు నైనా, అమ్మాయిల నైనా ఎలా పెంచాలి, ఆడపిల్లలో ధైర్యాన్ని ఎలా నింపాలి న్యాయస్థానంలో లైంగిక వేధింపులకు గురి అయిన మహిళలకు న్యాయస్థానంలో ఎలా అప్లై చేయాలి. వారికున్న బాధలు ఎలా చెప్పాలి.. ఎలా అటెండ్ కావాలి అనే విషయాల గురించి తెలియజేశారు. అమ్మాయిలు ముఖ్యంగా చదువుకోవాలని 18 ఏళ్ల లోపు పిల్లలకు బాల్యవివాహాలు చేయకూడదని, చేసిన తర్వాత వచ్చే పరిణామాలు గురించి వివరించారు. అమ్మాయిలు తన కాళ్లపై తాను నిలబడాలని మంచి ఉద్యోగం సంపాదించి ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనేక విషయాల గురించి తల్లిదండ్రులకు ఎంతో చక్కగా అవగాహన కల్పించారు. ఎంపీడీవో లక్ష్మి నరసింహ, తహసిల్దార్ లక్ష్మీ నాయక్, ఎస్ఐ విజయ నాయక్, ఏపిఎం పద్మావతి, సీసీ కొండయ్య, డాక్టర్ వనజ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లావణ్య, గ్రామ పెద్దలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ సంఘం అసిస్టెంట్ శివమ్మ పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి...

విశాలాంధ్ర-నార్పల : శింగనమల నియోజక వర్గంలోని రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ నమోదు తప్పనిసరిగా చేసుకోవా లని ఎమ్మెల్యే బండారు శ్రావణి పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రతి రైతు నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీ, సంక్షేమ పథకాలు అందుతాయి అన్నారు. దగ్గరలోని రైతు సేవా కేంద్రాలలో పట్టాదారు పాసు పుస్తకము, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు కి లింక్ మొబైల్ ఫోన్ తీసుకొని వెళ్లి ఓటిపిల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

రీసర్వే 2పై గ్రామ సభలు

విశాలాంధ్ర పామిడి .. రీసర్వే 2లో భాగంగా పామిడి మండలంలోని గజరాంపల్లి అక్కాజంపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కొరకు శనివారం గ్రామాల్లో తహసిల్దార్ శ్రీధర్ మూర్తి ఆధ్వర్యంలో రీసర్వే సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని.. ఇందులో భాగంగా 2,500 ఎకరాలు గల గజరాంపల్లిని రీసర్వే కొరకు ఎంపిక చేయబడినదని, ఇందుకు రైతులు,గ్రామస్తులు అందరూ పూర్తిగా సహకరించి కామ భూములను సర్వే చేయించుకుని నిర్దీత సమయంలోగా గ్రామంలో 100 శాతం రీ సర్వే పూర్తి అయ్యేటట్టు చూడాలని విజ్ఞప్తి చేశారు. తమకున్న సందేహాలు అనుమానాలను సామరస్యంగా నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అశిష్ట డైరెక్టర్ ల్యాండ్ రికార్డ్స్ సర్వేయర్ రూపాయల నాయక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు, సచివాలయం సర్వే రెవెన్యూ సిబ్బంది, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 23, మార్చి 2025

ఉపాధి కూలీలకు పనులు కల్పించి వలసలు నివారించాలి

బకాయిలు చెల్లించాలి వ్య.కా.సం జిల్లా ప్రధాన కార్యదర్శ బి.కదిరప్ప

విశాలాంధ్ర- కదిరి : ఉపాధి కూలీలకు పనులు కల్పించి వలసలను నివారించాలని, జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న బకాయిలు తక్షణమే విడుదల చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శ బి.కదిరప్ప కోరాట. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 32 మండలాలు, 425 గ్రామ పంచాయితీ లలో వ్యవసాయ పనులు లేకపోవడంతో దాదాపు 42 వేలమంది కూలీలు ప్రతి రోజు ఉపాధి పనులకు హాజరు అవుతున్నా వేతన బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయదానికి కుట్ర జరుగుతోందని దీనిని కూలీలందరూ ఐక్యంగా అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలకు పనులు లేక జీవనం కోసం పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు,కేరళ, మహారాష్ట్రలకు వలసలు పోతున్నారని,ఆయా ప్రాంతాల్లో ఉండదానికి సరైన వసతులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కూలీలు వలసలు పోకుండా ఆదుకుంటుం దన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం రూ.700/- ఇవ్వాలని,జాబ్ కార్డులో వున్న,అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొన్ని చోట్ల రాజకీయ కారణాలతో తొలిగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాని కోరారు.

ఉషోదయ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి..

విశాలాంధ్ర-హిందూపురం : ఈనెల 15 నుంచి ఒంటి పూట బడులను నిర్వహణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉషోదయ పాఠశాల యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని శనివారం విద్యార్థి సంఘాలుగా డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు నరసింహమూర్తి, చంద్రశేఖర్ సందీప్ లు మాట్లాడుతూ, ప్రభుత్వం ఈనెల 15 నుంచి వంటి పూట బడులను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని చెప్పినప్పటికీ దానిని ఏమాత్రం లెక్కచేయకుండా 15వ తేదీ నుంచి నేటి వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల 30 నిమిషాల వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, ఎండలు తీవ్రంగా ఉన్నయని, చిన్న పిల్లలను ఒంటిపూట బడులు పెట్టుకోవాలని, మానసికంగా వేదనకు గురిచేస్తున్న పాఠశాలపైన విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

25న కదిరిలో మెగా జాబ్ మేళా

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో ఏర్పాటు

విశాలాంధ్ర-కదిరి టౌన్ : ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్చి 25న నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ శివ శంకర, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకట రెడ్డి పేర్కొన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల లో నిర్వహించే మెగాజాబ్ మేళాకు 25 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జాబ్ మేళా లో హ్యుండై మోటార్స్, టాటా ఎలక్ట్రానిక్స్ జే వై సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, ఫ్లిప్ కార్ట్, విప్రో ఇన్ఫ్రా స్ట్రక్చర్ ఇంజనీరింగ్, డాక్టర్ రెడ్డీస్, కియా మోటార్స్, ముతూట్ ఫైనాన్స్ , గ్రీన్ టెక్, అపోలో ఫార్మసీ, అమర్ రాజా బ్యాటరీస్, కే ఎం ఎల్, హీరో మోటో క్రాప్ తదితర 25 బహుళ జాతీయ కంపెనీలు మెగా జాబ్ మేళా లో పాల్గొంటాయని వారు తెలిపారు. జాబ్ మేళాకు హాజరు అయ్యే నిరుద్యోగ విద్యార్హతలు పదవ తరగతి,ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా,బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ, నర్సింగ్ ,ఏదైనా డిగ్రీ బీటెక్, పీజీ,చదివిన వారు 18 నుంచి 35 ఏళ్లు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఈమెగా జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుండి రూ.40 వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు. ఇంటర్వ్యూలకు హాజరు అయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలను వెంట తెచ్చుకోవాలని.. మరిన్ని వివరాలకు 9390176421, 9182288465 ఫోన్ నంబర్స్‌కు సంప్రదించాలన్నారు. జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగులకు కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించామన్నారు. నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ హరికృష్ణ తెలిపారు.

మీసేవ కేంద్రాలకు పునరుజ్జీవం పోసిన చంద్రబాబు

విశాలాంధ్ర-రొళ్ల: మీసేవ కేంద్రాలకు పునరుజ్జీవం పోసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని హిందూపురం ఎం.పీ బీ.కే పార్థసారధి, మడకశిర శాసనసభ్యులు టీటీడీ పాలక మండలి సభ్యులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం మడకశిర పట్టణంలోని ఆర్.అండ్.బి గెస్ట్ హౌస్‌లో మీసేవ కేంద్రాల నిర్వాహకులతో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు నిర్వీర్యం అయిన మీసేవ కేంద్రాలను పునఃప్రారంభించి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యమని, కూటమి ప్రభుత్వం అందరికీ సమన్యాయం చేస్తోందని అన్నారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు గత ఐదేళ్లపాటు జీవనోపాధిని కోల్పోయి అప్పులపాలై, తమ కుటుంబాలు రోడ్డున పడిన విషయం చాలా బాధాకరమైన సంఘటనను చంద్రబాబు చూశారని, అందుకే త్వరితగతిన మీసేవ కేంద్రాల పునఃప్రారంభానికి చొరవ చూపారని గుర్తు చేశారు. మీసేవ ఆపరేటర్లందరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జి.కె ఈరన్న, హెుట్టబెట్ట క్లస్టర్ ఇంచార్జ్ భరత్, కోఆర్డినేటర్ రామకృష్ణ, యూనిట్ ఇంచార్జ్ దొమ్మరహాట్టి వెంకటేష్, హేమంత్ కుమార్ బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

అమ్మాయిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

విశాలాంధ్ర-ధర్మవరం : అమ్మాయిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని మండల న్యాయవిజ్ఞాన సదస్సు చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జ్ గీతావాణి పేర్కొన్నారు. శనివారం కోర్టు డివిజన్ పరిధిలోని చెన్నై కొత్తపల్లి మండలం ఎర్రోనాపల్లి గ్రామంలో ఆర్డిటి ఆధ్వర్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి గీతావాణితో పాటు ఆర్ డి టి రిజినల్ డైరెక్టర్ ప్రమీల కుమారి, జూనియర్ సివిల్ జడ్జి పి.వి.హరీష్, రామగిరి సిఐ శ్రీధర్ హాజరయ్యారు. అనంతరం జడ్జి గీతావాణి, ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ ప్రమీల కుమారిలు మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లాను బాలల స్నేహ జిల్లాగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాలకు దూరం గా ఉండండి, చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలి పారు. బాలలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. అమ్మాయిలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అలాగే ప్రస్తుత సమాజంలో ఎదురైయ్యే సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా, మండల న్యాయ సేవా అధికార సంస్థలు ప్రతి నెల గ్రామ స్థాయిలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సేవలు గురించి తెలియజేస్తుందని తెలిపారు. బాధితు లకు ఉచితంగా న్యాయవాదిని ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని, ఇలాంటి ఉచిత సేవలు పొందాలంటే ఒక సంవత్సరానికి రూ.3 లక్షల లోపు ఆదాయం ఉండాలన్నారు. ఖైదీల సంక్షేమం కోసం ప్రతి నెల ధర్మవరం సబ్ జైలు సందర్శించి వారి బాగోగులు తెలుసుకొని వారి ప్రవర్తనలో మార్పు కోసం ప్రయత్నం చేయడం జరుగుతోందని తెలిపారు. ఆర్‌డిటి సంస్థ బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వ శాఖలతో కలసి ముందస్తు చర్యగా అన్ని ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, పిల్లలకు, తల్లిదండ్రులకు ప్రస్తుత సమాజంలో పిల్లలకున్న సమస్యల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలత్రిపుర సుందరి, చరణ్, హేమంత్, ఆర్‌డిటి మహిళా అభివృద్ధి విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఏరియా టీం లీడర్ శ్రీనివాసులు, సిబ్బంది శారద, మురళి, గిఠావాణి, ప్రధానోపాధ్యాయులు మంజులా వాణి పాల్గొన్నారు.

నీటి నిల్వను పెంచడానికి ఫారం ఫండ్ తవ్వకాలు..

విశాలాంధ్ర-అగళి : మండల పరిధిలోని కోమరెపల్లి పంచాయతీలో శనివారం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా నీటి నిల్వలను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా విరివిగా ఫారంఫండ్‌లు తవ్వకాలు జరుపనున్నట్లు జడ్పీటీసీ ఉమేష్ కన్వీనర్ కుమార్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారం ఫండ్‌లు తవ్వాకంతో వర్షపు నీళ్లు నిలువ ఉండి భూగర్భ జలాలు పెంచవచ్చువచ్చాన్నారు.ఉపాధి హామీ కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీటర్ పరిమణానికి 280 రూపాయలు వస్తుందన్నారు. మండలానికి 350 కు పైగా ఫారం ఫండ్ మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు రమేష్ మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ ఈరన్న ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలి...

విశాలాంధ్ర-బుక్కపట్నం : రైతులకు నష్టం కలిగించే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే నిలుపుదల చేసి కాలువను వెడల్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో హంద్రీనీవా కాలువ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మూడు వేల క్యూసెక్కులతో హంద్రీనీవా నీటి ప్రవాహం ఉండేదని, లైనింగ్ పనులతో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోతుందని, భూగర్భ జలాలు కూడా తగ్గిపోతాయని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కాలవలోని పిచ్చి మొక్కలు తొలగించి కాలువలను వెడల్పు చేయాలని, లేదని, కాలువను వెడల్పు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ప్రభుత్వం వెంటనే స్పందించి, లైనింగ్ పనులను ఆపి, కాంట్రాక్టు రద్దు చేసి పంట కాలువ నిర్వహణ పనులు ప్రైవేట్ ఏజెన్సీకి ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు బ్యాల్ల అంజి, సిఐటియు నాయకులు కుళ్లాయప్ప, సిద్దు తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్‌బి కెపివన్ హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు.

బాలల లైంగిక నేరాల నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ మండల న్యాయ సేవా సమితి, సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ ఆధ్వర్యంలో శనివారంబాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం 2012పై గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ బి .ఎన్. స్వర్ణలత అధ్యక్షతన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. జడ్జి వాసుదేవన్ మాట్లాడుతూ పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించామని.. ఇది జెండర్ న్యూట్రల్ యాక్ట్‌ని ప్రతిఒక్కరూ మంచి స్పర్శలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్యవివాహాల అరికట్టటకు ప్రతిఒక్కరి కృషి చేయాలని గ్రామీణ స్థాయిలో బాల్యవివాహాలు ఎక్కువగా నమోదవుతున్నాయని తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించి వారి నమ్మక నిలబెట్టేలా మీ చదువు ఉండాలని అపరిచిత వ్యక్తులకు మాటలకు నమ్మి మోసపోరాదని తెలిపారు. అ బాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని, బాల్య వివాహం వలన మాతృ మరణాలు మరణాలు అధికమవుతాయని బాలికలు బాల్య వివాహాలను చేసుకోరాదని పిలుపునిచ్చారు. పిల్లలు ఏమైనా సమస్యలు లేక సంఘటనలు ఎదురైతే మీ తల్లిదండ్రులకు లేదా మీ ఉపాధ్యాయులకు భయ పడకుండా వెంటనే తెలియపరచాలని తెలియజేశారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసులు భార్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి అడ్వకేట్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సారా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు..

విశాలాంధ్ర-ముదిగుబ్బ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవోదయం 2.0లో భాగంగా ధర్మవరం ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ముదిగుబ్బ మండలం గుడ్డంపల్లె తాండ గ్రామంలో సారా అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సారా తాగడం వల్ల దుష్పరిమాణాలు గురించి ప్రజలకు వివరించారు. అలాగే సారా తాగిన క్రయ విక్రయాలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందా నాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, ముదిగుబ్బ ఏఎస్ఐ నాగ భూషణం, ధర్మవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి ధర్మవరం సబ్-ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా, నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు. స్కూల్ హెడ్ మాస్టర్స్, రెవిన్యూ అధికారులు వీఆర్వో, వీఆర్ఏ లు పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసు, ఫారెస్ట్ అధికారులు, విలేజ్ కానిస్టేబులు, సర్పంచులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ శవం లభ్యం

విశాలాంధ్ర-ధర్మవరం : మండల పరిధిలోని రేగాటిపల్లి గ్రామ శివారు నుండి కేతిరెడ్డి కాలనీకి వెళ్ళు తారు రోడ్డుకు ఎడమవైపున రేగాటిపల్లి గ్రామానికి చెందిన తిమ్మన్న గారి నాగిరెడ్డి బీడు పొలము వద్ద 35-40 సంవత్సరాలు వయసుగల మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో పడి ఉందని రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసు పత్రికి తరలించామని తెలిపారు. మృతి చెందిన మహిళ పేరు అక్కమ్మని, 30 సంవత్సరాలు కిందట మేడాపురం గ్రామం వదిలి శివానగర్లోని తిక్కస్వామి గుడి వద్ద నివాసం ఉంటుండేదని తెలిసిన వ్యక్తులు తెలుపుతున్నారు. రూరల్ పోలీసులు ఇది హత్యనా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? లేదా అనారోగ్యంతో మరణించిన? తదితర కోణాలలో రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తాయి

విశాలాంధ్ర-ధర్మవరం : చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తాయని ఆర్డిఓ మహేష్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ ప్రస్తుతం గత నెల రోజులుగా జిల్లాలో ఎండ వేడిమి అధికం కావడం జరిగిందని, ప్రజలు, చిన్నపిల్లలు ఎంతో ఇబ్బందికు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి సమయాల్లో పట్టణంలోని పలుచోట్ల చలివేంద్రాలను స్వచ్ఛంద సేవా సంస్థలు గాని, ఆసక్తిగల దాతలు గాని ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణానికి ఎన్నో పనులపై గ్రామాల నుండి తరలివస్తారని, అటువంటి ఈ చలివేంద్రాలు వారికి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.

బహిరంగ వేలం పాట వాయిదా

విశాలాంధ్ర-ధర్మవరం : పురపాలక సంఘ పరిధిలోని 2025-26 ఏళ్లకు దినవారపు మార్కెట్ జంతు వలసలకు సంబంధించిన బహిరంగ వేలం పాట ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ ఎన్. ప్రమోద్ కుమార్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ ఈనెల 22న జరగాల్సిన ఈ బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల రద్దు చేశామని తెలిపారు. వేలంపాటదారులు 25వ తేదీన హాజరు కావచ్చునని తెలిపారు

విద్యుత్ రాయితీపై అదనపు లోడు క్రమబద్ధీకరణ..

విశాలాంధ్ర-ధర్మవరం : గృహ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ధర్మవరం విద్యుత్ ఏడి లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. శనివారం మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ మండల కేంద్రాలు పట్టణ పరిధిలోని మూడు కిలో వాట్లకు దరఖాస్తు చేసుకునేలా ముందుగానే సంబంధిత విద్యుత్ అధికారులు వినియోగదారులకు సూచించడం జరిగిందని తెలిపారు. అదనపు లోడు అనగా కొత్తగా కనెక్షన్ తీసుకునే సమయంలో గృహోపకరణాల వినియోగాన్ని అంచనావేసి కిలోవాట్లలో లెక్కిస్తామని తెలిపారు. ఈ మేరకే డెవలప్మెంట్ చార్జీలు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామ మండల కేంద్రాలలో కనీసం రెండు సింగల్ వాట్లు, పట్టణాలలో 3 కిలోవాట్ల ఉంటుందన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ప్రభుత్వం కల్పించిందని, దరఖాస్తులు ఆన్లైన్ లేదా విద్యుత్ కార్యాలయాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వినియోగదారులు ముందుకొచ్చి సర్వీసును క్రమబద్ధయించుకోవాలని తెలిపారు.

23న దివ్యాంగుల వైద్య శిబిరం

విశాలాంధ్ర-ధర్మవరం : మండలంలోని ధర్మపురి గ్రామంలో మొదటిసారి ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వృద్ధుల దివ్యాంగుల ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెడ్క్రాస్ ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్, సీనియర్ రెడ్ క్రాస్ ప్రతినిధి, కోఆర్డినేటర్. డాక్టర్. సత్య నిర్ధారన్, యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర తెలిపారు. శనివారం మాట్లాడుతూ ధర్మపురి గ్రామ పరిధిలోగల ఎర్రగుంటపల్లి, రావులచెరువు, ఆకుతోటపల్లి తదితర గ్రామ ప్రజలు ఈ శిబిరమును సద్వినియోగించుకోవాలని తెలిపారు. ప్రముఖ వైద్యులు షాహిద్ నాగరాజా ఆచారి మనోజ్ కుమార్ రమ్యత కిషోర్ లచే కంటి వైద్యం, దంత వైద్యం, ఫిజియోథెరపీ, జనరల్ వ్యాధులకు ఈ శిబిరంలో వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో గుర్తింపు

విశాలాంధ్ర-ధర్మవరం : క్రమశిక్షణతో కూడిన విద్య జీవితంలో మంచి గుర్తింపు ఇస్తుందని పట్టణ ప్రముఖులు సంధా రాఘవ, ఎంఈఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. శనివారం పట్టణంలోని పుట్టపర్తి రోడ్ సాయి నగర్‌లో గల షిరిడి సాయిబాబా కళ్యాణ మండపంలో శ్రీ సాయి విక్టరీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 14వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, తపన, లక్ష్యం లాంటి వాటిని ప్రతి విద్యార్థి లక్ష్యంగా చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు బాల బాలికలు అని తేడా లేకుండా తమ పిల్లలను ఉన్నత స్థాయి వరకు చదివించేలా కంకణం కట్టుకోవాలని అన్నారు. నేటి విద్యార్థులు టీవీలకు సెల్ ఫోన్‌లకు బానిస కాకుండా, చదువు అనే వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతిభ పిల్లలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొండన్న, డైరెక్టర్ రాఘవేంద్ర, కరస్పాండెంట్ జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.

వడగండ్ల వర్షం..అపార నష్టం

విశాలాంధ్ర-చిలమత్తూరు : మండల పరిధిలోని మరసలపల్లి, చాగలేరు, పలగలపల్లి, సోమగట్ట, కొడికొండ పంచాయతీ గ్రామాలలో శనివారం వడగండ్ల వర్షంతో రైతులకు నష్టం వాటిల్లిందని లబోదిబోమంటున్నారు. కోతకు వచ్చిన వరి పంట, దాదాపు 50 ఎకరాలు, పూత, పిందే దశలో ఉన్న దాదాపు 8 ఎకరాల మామిడి తోటల్లో వడగండ్ల వర్షానికి నేలరాలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు, అప్పు చేసి, నగలు తాకట్టుపెట్టి, కాయ కష్టం చేసి పంటలు పండిస్తే ప్రకృతి కరుణించకపోవడంతో వడగండ్ల వర్షం రూపంలో మమ్ములను మోసం చేసిందని రైతుల కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వం మాపై దయతలచి పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు..

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు. శనివారం ఎంపిడివో సిబ్బంది, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మాధవ రెడ్డి,ఎస్సై వలిబాషా, పిఆర్ జేఈ వరప్రసాద్, ఇరిగేషన్ ఏఈ మహేష్, ఆర్ఐ శ్రీధర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

విశాలాంధ్ర-హిందూపురం : ప్రజా సంక్షేమం దృష్ట్యా అన్ని ఆరోగ్య కార్యక్రమాలు సకాలంలో ప్రజలకు చేరువయ్యేలా ఆరోగ్య సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.ఫైరోజా బేగం పేర్కొన్నారు. శనివారం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతివార్డు, పట్టణములోని అయిదు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులు, ల్యాబ్ నిర్వహణ, మందుల పంపిణీ తదితర రికార్డులను పరిశీలించి పలుసూచనలు చేశారు. జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డా, శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగల ముఠా అరెస్టు, రిమాండ్‌కు తరలింపు..

కత్తి, కారు, నగదు స్వాధీనం

విశాలాంధ్ర, గోరంట్ల : కియా ఉద్యోగిని కారులో ఎక్కించుకొని కొంత దూరం వెళ్ళాక కత్తితో బెదిరించి, జేబులోని నగదు, అకౌంట్‌లోని నగదును లాక్కున్న దారి దోపిడీ దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ బోయ శేఖర్ తెలిపారు. ఈనెల 19వ తేదీ రాత్రి గోరంట్ల మండలంలోని పులగుర్లపల్లి గ్రామం వద్ద నిలబడి వున్న, పులగుర్లపల్లి గ్రామ నివాసి ఎన్. నంద కుమార్ (27) తండ్రి లేట్ నరసింహప్ప అను అతనినీ పెనుకొండ వెళ్ళడనికి వాహనాల కోసము వేచి వుండగా, నలుగురు వ్యక్తులు, కారులో బెంగళూరు వైపు నుండి వచ్చి నంద కుమార్‌ని బలవంతగా, కారులోకి లాక్కికి అతనినీ చంపుతామని కత్తితో బెదిరించి అతని వద్ద గల 60 వేల నగదు, మరియు ఫోన్ పే ద్వారా 15,450 డబ్బు దోచున్నారు, నంద కుమార్ చాకచక్యంగా తప్పించుకొని పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి బెంగళూరు-హైదరాబాదు జాతీయ రహదారిపై అదుపులోకి తీసుకున్నారు. నందకుమార్ ఫిర్యాదు మేరకు గోరంట్ల పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టరు బోయ శేఖర్ కేసుగా నమోదు చేసి, నేరం చేసిన నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి, వారి వద్ద నుండి కారు, ఒక కత్తి, రూ.12 వేలు నగదు స్వాధీన పరుచుకుని, వారిని పెనుకొండ కోర్టు వారి వద్ద హాజరుపరచగా, పెనుకొండ కోర్టు వారు వారికి 15 రోజులు రిమాండ్‌కు తరలించారు. అరెస్టు కాబడిన నిందితులు.. తెలంగాణ జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం, ఎల్లమాను గుడి, మాదా పూర్ గ్రామానికి చెదిన గండం సంతోష్(24), జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం, జుంజపడుగు గ్రామం, పస్తం కళ్యాణ్(21) తండ్రి రాజేషం, ఇదే జిల్లా గొల్లపెల్లి మండలం, జుంజపడుగు గ్రామానికి చెదిన పస్తం శివాజీ (22), జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం, జుంజపడుగు గ్రామానికి చెందిన తూర్పాటి ఆదర్శ్(21)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మాలల జేఏసీ నాయకుల హౌస్ అరెస్ట్ అన్యాయం

విశాలాంధ్ర-తలుపుల : కర్నూలు, మాధవీనగర్ మాల మహానాడు కార్యాలయంలో పోలీసులు దళిత నాయకులపై ప్రజా సమస్యలపై పోరాడే వాళ్లపై నిఘాబెట్టడం అన్యాయం బావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడం అన్యాయమని మాల జేఏసీ అధ్యక్షులు సుదర్శన్ ప్రధాన కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్ ప్రచార కార్యదర్శి అజయ్ కుమార్ ఉపాధ్యక్షులు ధన శేఖర్ సహాయ కార్యదర్శి పాలకొర చిరంజీవి వీరిని హౌస్ అరెస్ట్ చేయడం అన్యాయమని మాల జేఏసీ నాయకులు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాలల జేఏసీ నాయకులు రామచంద్రయ్య, అంజన్‌బాబు, ఎల్వి రమణ మాట్లాడుతూ మాలలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మాలలు రాయలసీమలోని తిరుపతిలో సింహగర్జన నిర్వహించాలని నిర్ణయించామని, ప్రభుత్వం అంచి వేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సూర్య, అనిల్, రాజు, చంద్రాయుడు, మౌళి, తదితరులు పాల్గొన్నారు

అంగన్‌వాడీలతో కలసి భోజనం చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుడిబండ : గుడిబండ మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ హెల్పర్లు నూతనంగా నియామక పత్రాలను ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు అందజేశారు. చిన్నారుల యోగక్షేమాలు చూసే బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడం అంగన్వాడీలతోనే ప్రారంభమవుతుందని గుర్తు చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని తెలిపారు. ఆర్అండ్ బి గెస్టహౌస్ సమీపంలో ఉన్న స్త్రీ, శిశుసంక్షేమ భవనాన్ని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ భోజనం చేస్తున్న అంగన్వాడీలతో కలిసి భోజనం చేశారు. ఏ సమస్య వచ్చినా మీకు నేనున్నానంటూ తన ఫోన్ నంబర్ ఇచ్చి వారిలో మనోధైర్యాన్ని నింపారు.

సారా ధ్వంసం చేసిన ఎక్సైజ్ పోలీసులు

విశాలాంధ్ర-పుట్టపర్తి : బుక్కపట్నం మండలం నక్కలగుట్టకొండ వద్ద నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. నిందితుడు గరుగుతాండాకు చెందిన నాగప్ప వద్ద 6 లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నామన్నారు. 140 లీటర్ల బెల్లపు ఊట నశింపచేశా మన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నామన్నారు. సారా తయారు చేసిన, అమ్మిన కఠిన చర్యలు తప్పవని నాగరాజు హెచ్చరించారు. దాడులలో హెడ్ కానిస్టేబుల్ నాగభూషణం, ఎక్సైజ్ సిబ్బంది సురేష్‌బాబు, నరసింహారెడ్డి పాల్గొన్నారు

పేదరికం లేని సమాజాన్ని చేయడమే పి-4 సర్వే లక్ష్యం..



విశాలాంధ్ర-ధర్మవరం: పేదరికం లేని సమాజమును తయారు చేయడమే పి-4 సర్వే లక్ష్యమని టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం గౌడ్ 25వ వార్డు టిడిపి ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్ నాయుడు తెలిపారు. శనివారం 25వ వార్డు సచివాలయ ఉద్యోగులకు పి-4 యాప్ ద్వారా నమోదు చేసిన సర్వే పూర్తి చేసుకున్న వార్డు సచివాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి చేసిన సర్వే నిర్వహణలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని, పేదవారిని ఆర్థిక సామాజిక రంగాల్లో తీసుకొచ్చే విధంగా పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ సర్వేను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. పేదలను ధనికులను భాగస్వామ్యం చేసేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుం దని తెలిపారు. ఇంకనూ ఈ సర్వే చేయించుకోని వారు ఉంటే వెంటనే చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చీమల రామాంజి, మాధవరెడ్డి, బీజేపీ నాయకులు శారదమ్మ, జనసేన నాయకులు కోలా నాగార్జున, మల్లన్న, అఖిల్, సచివాలయ సిబ్బంది ,సాయి ప్రకాష్, పుష్పరాజ్, ఉమాదేవి, నరేంద్ర, సరిత ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 23, మార్చి 2025

ప్రజల అవసరాలు తీర్చలేని ప్రభుత్వాలెందుకు..?

విశాలాంధ్ర -ధర్మవరం : మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక వైస్సార్ కాలనీ లో నెలకొన్న సమస్యలపై శనివారం వార్డు పర్యటన చేసి స్థానిక ప్రజలను సిపిఎం నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ఆలకుంట మారుతీ, సీనియర్ నాయకులు ఎస్ ఎచ్ బాషా, టీ,అయూబ్ ఖాన్, గుంపుహరి, మాట్లాడుతూ, ఈ కాలనీ ఏర్పడి ఇరవై సంవత్సరాలైన ఇంతవరకు ప్రజలకు కనీస అవసరాలైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్లు సంపూర్ణ దిశలో లేకపోవడం దారుణమన్నారు.పదిరోజులకి ఒక సారి కూడారాని త్రాగునీరు, అయినా మున్సిపాలిటీ అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులకు గాని, పట్టించుకోకపోవడం గమనార్హం అని తెలిపారు. ఇక్కడి ప్రజలు తమ ఆవేదనను తెలిపిన కూడా పరిష్కారం కాకపోవడం ఎంతవరకు సమంజసమని వారు అధికారులను ప్రశ్నించారు. ఏ పనికి అయినా నీరు ప్రధాన అవసరం అని, అటువంటిది నీరు సక్రమంగా సరఫరా చేయక పోతే, కాలనీవాసులు ఎక్కడకెళ్ళి తెచ్చుకోవాలని ప్రజా ప్రతినిధులను మున్సిపల్ అధికారులను వారు ప్రశ్నించారు.మున్సిపల్ కమీషనర్ ఈకాలనీలో సమస్యలపై తక్షణమే ఇక్కడ పర్యటించి వీరికి ఒక పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు.ఇక రోడ్లు అయితే ఎక్కడ వేయలేదని, అందువలన గుంతలుపడి అస్తవ్యస్తంగా మారిపోవడంతో రాత్రిపూట ఈ కాలనీ లోపలికి ఆటోవాళ్ళు రావాలన్న, ద్విచక్ర వాహనాల్లో రావాలన్నా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారు మండిపడ్డారు. అందులోను కాలనీ మొత్తానికి ఒక్కటే డ్రైనేజీ ఉండడం వల్ల ఇళ్ల ముందే మురుగు నీరు నిల్వ ఉండి పోయిందన్నారు, ఇలా పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల, రోగాలు ప్రబలి ఇక్కడి పిల్లలు వృద్దులు అందరూ ఆసుపత్రుల చుట్టూ తిరుగాల్సిపరిస్థితి దాపురించడం జరిగిందన్నారు.ఇటువంటి పరిస్థితుల్లో కూడా పాములు, విషపురుగులు అదికంగా ఉంటా యని, ఇటువంటి చోట రాత్రి వేళల్లో బయటకి రావాలంటేనే బయపడి జీవనం సాగిస్తున్నారని, అందువలన తక్షణమే ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ వైస్సార్ కాలనీలో నెలకొన్న సమస్యలని పరిష్కరించాలని, లేని పక్షంలో సి పి ఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఖాదర్ బాషా,హైదర్ వలి,వెంకట స్వామి, మహబూబ్ పీరా తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర - కనేకల్ : కనేకల్ గ్రామంలోన మూడు ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం, గ్రామీణ బ్యాంక్ ఎదురుగా ఉన్న మరియు కొలిమి మిరా వారి ఇంటి ముందర ఉన్నది ఈ స్తంభం, ఇది వరకే ఈ వార్త విశాలాంధ్ర పత్రికలో ప్రచురణ అయినది. కానీ దీనిపైన ఎటువంటి చర్యలు తీసుకోలేదు విద్యుత్ అధికారులు. ఈ పాత స్తంభం ప్రక్కనే కొత్త స్తంభం కూడా ఉన్నది, అలాగే ప్రమాదం జరిగే అవకాశం కూడా ఉన్నది, ఇకనైనా ఈ పాత స్తంభం తీగలని కొత్త స్తంభానికి అమర్చి పాత స్తంభం తీసివేయాలని ప్రజలు పత్రికలు ఎన్ని రోజుల నుంచి ప్రయత్నం చేస్తున్న పట్టించుకోవడం లేదు విద్యుత్ అధికారులు. మూడు దారుల కలయికలో ఉన్న ఈ విద్యుత్ స్తంభం. ఉదయం పూట సాయంత్రం పూట బడి పిల్లల తిరిగే ఈ దారిలో ఎక్కువ రద్దీగా ఉంటుంది ఈ ప్రాంతంలో, పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరని ప్రజలు విద్యుత్ అధికారులని అడుగుతున్నారు. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే దారి మధ్యలో ఉన్న గల స్తంభాన్ని తీసివేసి కరెంట్ తీగలను కొత్త స్తంభానికి అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

స్మశానంలో మౌలిక వసతులకు భూమి పూజ

విశాలాంధ్ర-ఉరవకొండ : పట్టణంలోని వీరశైవ రుద్రభూమిలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు, టీడీపీ రాష్ట్ర నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో బోరు, మోటార్ సిస్టం ట్యాంక్, కరెంట్ సరఫరా ఏర్పాట్లకు సంబంధించి శనివారం గవిమఠం సంస్థాన ఉత్తరాధికారి శ్రీ కరిబసవ రాజేంద్ర స్వామి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రుద్రభూమిలో పయ్యావుల సోదరుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమం చేపట్టినందుకు వీరశైవ సమాజం తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం నాయకులు పాటిల్ నిరంజన్ గౌడ్,ఆమిద్యాల యోగేష్, దేశాయ్ వీరేష్ మోపిడి చంద్రమౌళి, నీలకంఠ, బసవరాజు, డిష్ మల్లికార్జున, పాటిల్ రామ్మోహన్,నింబగల్లు కిషోర్, వార్డు మెంబర్లు రామంజి నెయులు, ప్రభాకర్ స్థానిక నాయకులు ఆకుకూర నాగరాజు, కాంట్రాక్టర్ ముస్టురు బాషా తదితరులు పాల్గొన్నారు.

నూతన మండల అధ్యక్షులకు కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర -యాడికి : భారతీయ జనతా పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు కొనగొండ్ల రాజేష్ అధ్యక్షతన నిర్వహణలో అనంతపురంలో జిల్లా వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైనా మండల అధ్యక్షులు, జిల్లా పదానాధికారులు రాష్ట్ర బాధ్యత ఉన్న కార్యకర్తలతో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ బిట్రా శివనారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా తాడిపత్రి రంగనాథ రెడ్డి చేతుల మీదుగా యాడికి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన వద్ది రాజశేఖర్ కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగం అంకల్ రెడ్డి,రాష్ట్ర లీగల్ కన్వీనర్ పి.వి ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివ నారాయణ,. , జిల్లా ఉపాధ్యక్షుడు సింగరి లక్ష్మీనారాయణ,మండల అధ్యక్షులు,మహిళా మోర్చా నాయకులు, పాల్గొన్నారు.

24న సామాజిక తనిఖీ ప్రజావేదిక

విశాలాంధ్ర -యాడికి : మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో రేపు 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీర్రాజు ఓప్రకటనలో పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద యాడికి మండలంలో ఏప్రిల్ 1, 2023 నుండి మార్చి 31, 2024 వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులు, వాటితో పాటు అనుసంధాన పథకాలైన పశుసంవర్ధక, హౌసింగ్, పంచాయతీరాజ్, ఫారెస్ట్, సెర్పు లపై జరిగిన పనులను 17వ విడత సామాజిక తనిఖీ బృందం మార్చి 11, 2025 నుండి మార్చి 23 వరకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కడపటి నివేదికపై చర్చించేందుకు మండల స్థాయిలో సోమవారం ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు. ఈ ముఖ్యమైన సమావేశానికి ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో వీర్రాజు కోరుతున్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

విశాలాంధ్ర -బొమ్మనహాళ్ : నీటిని వృథా చేయకుండా ఒడిసి పట్టుకోవాలని బొమ్మనహాళ్ ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్ అన్నరు. శనివారం మండల కేంద్రం లోని ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతలు, ఫారంపాండ్లను ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు మండల కేంద్రంలో అంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిని సంరంక్షించేందుకు ఫారంపాండ్, ఇంకుడు గుంతలు మొక్కలు పెం పకం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో కొళాయిల వద్ద, నీటి సరఫరా ట్యాంకుల వద్ద నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలుస్వామి టెక్నికల్ అసిస్టెంట్ నాగేంద్ర తదితరలు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయంతోనే ఆరోగ్య భద్రతకు భరోసా

విశాలాంధ్ర -అనంతపురం : పెరుగుతున్న ఆరోగ్య సమస్యలకు సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా స్థానిక రకాల పంటలను పండించడమే ఏకైక పరిష్కారమని, రాబోయే కాలంలో ఆహార, ఆదాయ భద్రతను కల్పించడమేనని శనివారం స్థానిక పోలీస్ కన్వెన్షన్ హాల్లో ప్రారంభించిన మూడు రోజుల కార్యక్రమం"మన వ్యవసాయం, పంటలు, వంటకాలు ఆరోగ్యం" ప్రారంభోత్సవంలో వక్తలు అభిప్రాయపడ్డారు.అనంతపురం మాజీ కలెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.జనార్దన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం అనంతపురంలోని సుభాష్ పాలేకర్ సహజ సాగు సూత్రాలను అనుసరించి ఎకరానికి రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఆర్థిక భద్రత కల్పించాలని ప్రకృతి వ్యవసాయ స్వతంత్ర ప్రచారకర్త విజయ రామ్ పిలుపునిచ్చారు.

రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

విశాలాంధ్ర -శింగనమల : రైతులందరూ మీ పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో రైతు రిజిస్ట్రేషన్ ఖచ్చితంగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు రిజిస్ట్రేషన్ కింద శింగనమల మండలంలో 1573 మంది రైతులు రిజిస్టర్ అయ్యారన్నారు. రైతులు మీ మీ రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసియించుకోవాలని, రైతు పట్టాదారు పాసు పుస్తకము, ఆధార్ కార్డు మరియుఆధార్ కార్డు కి లింక్ అయిన మొబైల్ తీసుకొని వెళ్లి ఓటీపీ ల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్ తెలిపారు.

26న పంచాయతీ మార్కెట్ వేలం

విశాలాంధ్ర - కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీకి సంబంధించిన వివిధ మార్కెట్ షాపింగ్ గదులకు వేలం పాటలు ఈనెల 26.27వ తేదీలలో పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ రాధా, అధ్యక్షతన నిర్వహిస్తామని పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి రామ్ గోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ వారపు సంత,దినసరి సంత, బస్టాండ్ ,సులభ కాంప్లెక్స్ కు, 27వ తేదీ 40 షాపింగ్ కాంప్లెక్స్ గదులకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. పంచాయతీని బకాయి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులు అన్నారు. ఈ వేలం పాటలు పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహిస్తామని మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చంద్రబాబు, మందకృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - అగళి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాదిగ జాతికి ఇచ్చిన మాట తప్పకుండా శాసనసభలో ఏబిసిడి వర్గాలను కోసం బిల్లును అమోదించడం పట్ల మండల దళిత నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం అగళి బస్టాండ్ ఆవరణంలో గల భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తూ పాలాభిషేకం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు సైతం పాలాభిషేకం చేసారు.

ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పిఎస్ నాయకులు ఎంఎస్ఎఫ్ ఉద్యోగస్తుల సంఘం నాయకులు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.ఎమ్మార్పీఎస్ నాయకులు లోకేష్, నాగోజి రాయుడు, మల్లేష్ లింగన్న భూతరాజ్, శివన్న వీరకేత, చిగ నాగప్ప దళితులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు "కస్తూరిబా పాఠశాల" ఒక వరం

విశాలాంధ్ర - గోరంట : గోరంట్ల మండలంలోని మందలపల్లి వద్ద ఉన్న కస్తూరిబా గాంధీ గిరిజన పాఠశాలలో(కేజీబీవి) 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎమ్.శిరిష తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శిరీష మాట్లాడుతూ ఈ సందర్భంగా 6,11వ (ఇంటర్మీడియట్) తరగతుల్లో ప్రవేశాల కోసం ఆన్ లైన్ వరఖాస్తు చేసుకోవాలని,6వతరగతి 40 సీట్లు, ఇంటర్మీడియట్ సి ఈ సి గ్రూప్లో కేవలం 40 సీట్లు మాత్రమే ఉన్నాయని, ఖాళీగా ఉన్న సీట్లు కోసం బాలికలు ఆన్ లైన్ లో ఈ నెల 22 నుంచి ఏప్రిల్11 వరకు దరఖస్తు చేసుకోరే వచ్చని, అనాథలు, బడి బయట పిల్లలు డ్రాప్ అవుట్ (బడి మానివేసిన వారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ బీపీఎల్ బాతకలు అర్హులని, ఆన్ లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మత్రమే పరిగణిస్తామని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్, మేసేజ్ ద్వారం సమాచారం అందు తుందని,స్థానిక పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చునని తెలిపారు. అనాథ బాధితులు నిరుపేదలు షెడ్యూల్ కులాలు తెగలు వెనుకబడిన తరగతులు తల్లి లేదా తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని, కస్తూర్బా బాలికల విద్యాలయాలు ఉన్నత లక్ష్యంతో ఏర్పాటైన కేజీబీవీ లో వేలాదిమంది విద్యార్థులకు ఉచితంగా విద్య అందిస్తున్నారని, గతంలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు మాత్రమే ఉచితంగా విద్యను అందించే వారిని, ప్రస్తుతం కేజీబీవీలో ఇంటర్మీడియట్ వరకు విద్యతోపాటు కంప్యూటర్, ఆటలు యోగ తదితర అంశాలునిర్వహిస్తున్నామని,ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శిరీష తెలిపారు.

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

విశాలాంధ్ర- ఉరవకొండ : ఉరవకొండ మండలం పెన్నాహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలవ దీర్చి ఆలయము చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవం నీటితోనే మూలాధారం

విశాలాంధ్ర - జెఎన్టియుఏ : జీవం నీటితోనే మూలాధారమని మదనపల్లి ఇంజనీరింగ్ కళాశాల ఎన్సిసి లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎన్ సి.సి విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ చరిత్ర జల వనరులతో ముడిపడి ఉందని అన్నారు. జీవవైవిధ్య రక్షణ, వృధా నీటిని అరికట్టడం, కలుషిత నీటిని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకొచ్చేలా మార్గాలను అన్వేషించాలి అన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర -యాడికి : పెద్దవడుగురు మండల కేంద్రంలో ఉమామహేశ్వర ఆలయ ఆవరణంలో శనివారం స్వాతంత్ర సమరయోధులు, సిపిఐ సీనియర్ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిభిరానికి విశేష స్పందన. లభించింది కర్నూలు శాంతారాం హాస్పిటల్ వైద్య బృందం ఈ వైద్య శిబిరానికి వచ్చిన వందమందికి. వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో వివిధ కంటి జబ్బులు ఉన్న 50 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు సిపిఐ సీనియర్ నాయకులు ఎద్దుల సూర్య నారాయణరెడ్డి భోజన వసతి కల్పించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ గత కొన్ని ఏళ్లుగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం హర్షనీయమని మండల ప్రజలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకన్న, మాజీ మండల ప్రెసిడెంట్ కేశవరెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు విజయ భాస్కర్ సిపిఐ సీనియర్ నాయకులు ముత్యాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విశాలాంధ్ర-నార్పల : పీఎం కిసాన్ పథకం మలి మళ్లీ విడత రైతులకు రావడానికి ఆంధ్రప్రదేశ్ రైతు రిజిస్ట్రేషన్ నెంబర్ కచ్చితంగా చేసుకోవాలని శనివారం మండల వ్యవసాయ అధికారి చన్న వీరస్వామి కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు రిజిస్ట్రేషన్ కింద మన నార్పల మండలంలో 1678 మంది రైతులు రిజిస్టర్ కావడం జరిగింది. ప్రతి రైతులు మీ రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని కోరారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

విశాలాంధ్ర - పుట్టపర్తి : విద్యుత్ బకాయిలకు సంబంధించి ప్రభుత్వం నుంచి జిల్లాకు 300 కోట్లు రావాల్సి ఉందని ఎస్ ఈ సురేంద్ర కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా విద్యుత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం విడతలవారీగా మొత్తాన్ని మంజూరు చేస్తుందన్నారు. 17 కోట్ల రూపాయలు ప్రైవేట్ నుంచి వసూలు చేయాల్సి ఉందన్నారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీలకు సంబంధించి 200 యూనిట్లు దాటి ఎవరు విద్యుత్ వారిన వాళ్లు బిల్లులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రోజు ప్రాంతాల్లో ఎస్సీ ఎస్టీలకు ఈ అంశంపై అవగాహన కల్పిస్తామ న్నారు. పిఎం సోలార్ విద్యుత్ పథకం కింద సబ్సిడీ ఉందని ఈ పథకాన్ని వినియోగించుకుంటే చాలావరకు విద్యుత్ చార్జీల భారం తగ్గుతుందన్నారు. అదేవిధంగా అక్రమంగా విద్యుత్ వాడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ఒక టీం పని చేస్తుందన్నారు. అతనకు లోడ్ విద్యుత్తు వాడుతున్న వారు కూడా ఖచ్చితంగా చార్జీలు చెల్లించాల్సి వస్తుందన్నారు.

ప్రపంచ జాతీయ జల దినోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - పామిడి : మండల పరిధిలోని సొరకాయల పేట గ్రామంలో ప్రపంచ జాతీయ జల దినోత్సవం సందర్భంగా ఫారం పాండ్ పనులను ఎంపీడీవో తేజోష్ణ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కూలీలకు ఉపాధి కోసం పనులు కల్పించేటలో భాగంగా సొరకాయల పేటలో ఫారం ఫండ్ పనులను కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేజష్ణ,గ్రామ సర్పంచ్ మూలి నాగేశ్వర్ రెడ్డి ఏపీవో మల్లేశ్వరి టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఫీల్డుఅసిస్టెంట్ కులయప్ప, నాయకులు సాదం రామాంజనేయులు అబ్దుల్ ఖాదర్ దొడ్లో రామంజి శంకర్ నవీన్ సుబ్రహ్మణ్యం వద్దే నాగన్న గ్రామ ఉపాధి హామీ పథకం కూలీలు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర- గుంతకల్ : శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం కసాపురం నందు శనివారం అనంతపురం నగర వాస్తవ్యులైన డి.అశోక్ రావు వారి కుటుంబ సభ్యులు దేవస్థానం నందు జరుగు వివిధ అభివృద్ధి పనులు నిమిత్తము ఒక లక్ష రూపాయలు చెక్కు విరాళంగా సమర్పించిన్నారు, విరాళ దాతలకు దేవస్థానం తరపున శ్రీ స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

పి.కొత్తపల్లిలో జల దినోత్సవం

విశాలాంధ్ర - ఆత్మకూరు : ఆత్మకూరు గ్రామపంచాయతీ పరిధిలోని పి కొత్తపల్లి గ్రామంలో శనివారం ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూమిలోకి పంపించి రైతుకు మరియు నీటి ఉత్పత్తిని పెంపొందించడం కోసం ఫారం పాండ్ లను ఏర్పాటు చేయడం కోసం కార్యక్రమాలు రూపొందించారు. ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ వేతన దారులతో కలిసి ఫారంపాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏపీడి చెన్నకేశవులు, ఎంపీడీవో జి లక్ష్మీ నరసింహ, ఏపీఓ సుజాత, గ్రామపెద్దలు ప్రజలు పాల్గొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేశారు.

ఫారం ఫండ్‌కు భూమి పూజ..

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని హులీకుంట పంచాయితీలో గల వన్నారనపల్లి గ్రామంలో శనివారం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఫారంఫండ్ పూడికలు తీయడానికి భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రామారావు హాజరయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారం ఫండ్ పూడికల ద్వారా వర్షం ద్వారా వచ్చే నీళ్లు నిలువ ఉండి భూగర్భ జలాలు పెంచవచ్చు అన్నారు అర్హులైన వారు తమ ఉపాధి హామీ జాబ్ కార్డు వివరాలతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లకు సంప్రదించాలని కోరారు కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ ఓబులప్ప,టెక్నికల్ అసిస్టెంట్ మారేగౌడ్,టీడీపీ సీనియర్ నాయకులు రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప,టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి,తెదేపా మండల కార్యదర్శి జి.కె ఈరన్న ఆర్టిఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి నారాయణ,మీసేవ వెంకటేష్,నాగరాజు,కంప్యూటర్ ఆపరేటర్ నరసేగౌడు,తదితరులు పాల్గొన్నారు

పిల్లలను హింసాత్మక సంఘటనలకు గురి కాకుండా చుసుకుందాం

విశాలాంధ్ర- పెనుకొండ : పిల్లలు హింసాత్మక సంఘటనలకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ,మిషన్ వాత్సల్య, డిసిపియు, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పిల్లలను ఆన్లైనులో హింసాత్మక సంఘటనలకు గురి కాకుండా,బాలల న్యాయ చట్టం,బాల్య వివాహాలు నిలుపుదల,శిశుగృహ దత్త త గురించి పెనుకొండ ఆర్డీఓ సమావేశ మందిరంలో మహిళా పోలీసులు పంచాయతీ కార్యదర్శులకు డివిజనల్ స్థాయి ఒకరోజు కార్యశాలలో ముఖ్య అతిథిగా హాజరైన పెనుకొండ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సీడీపీఓ శాంతలక్ష్మి తో కలిసి తెలిపారు. డిఎస్పీ మాట్లాడుతూ పిల్లలను ప్రభావితం చేసే అంశాలలో అత్యంత ముఖ్య భూమిక పోషిస్తున్న మొబైల్ సిని ప్రపంచం ఉన్నాయి వాటి గురించి మహిళా పోలీసులు తెలుసుకుని పిల్లలను వాటి నుండి రక్షించ వలసిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా బాలికలు లైంగిక వేధింపులకు గురి కాకుండా చుసుకోవలసిన బాధ్యతను హాజరైన వారికి గుర్తు చేశారు. శాంతలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న స్కూల్స్ విజిట్ చేసి ఎవరైతే దుర్భాలమైన పరిస్థితులలో ఉన్న పిల్లలు,ఒంటరి తల్లిదండ్రులు ఉన్న పిల్లలు,ఇబ్బందులకు గురి కాబడే పిల్లలు ఉంటారో వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆ పిల్లలను టార్గెట్ చేసుకుని బాల్య వివాహాలు చేయడం ట్రాప్ చేయడం వంటివి జరగకుండా చూసుకోవాలి అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్, సోసియల్ వర్కర్ వనజాక్షి,శిశుగృహ మేనేజర్ సునీత, లక్ష్మీప్రసన్న,పవన్, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాటు సారా ధ్వంసం

విశాలాంధ్ర -పుట్టపర్తి : బుక్కపట్నం మండలం నక్కలగుట్టకొండ వద్ద నాటు సారాను తయారు చేస్తున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. నిందితుడు గరుగుతాండాకు చెందిన నాగప్ప వద్ద ఆరు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకొన్నామన్నారు. అదేవిధంగా 140 లీటర్ల బెల్లపు ఊటను నశింపచేశామన్నారు. ముద్దాయిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపుతున్నామన్నారు. నాటు సారా తయారుచేసిన , అమ్మిన కఠిన చర్యలు తప్పవని నాగరాజు హెచ్చరించారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ నాగభూషణం, ఎక్సైజ్ సిబ్బంది సురేష్ బాబు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం

విశాలాంధ్ర -పెనుకొండ : మండలం చంద్రగిరి గ్రామంలో హ్యుందాయి స్టీల్ కంపెనీ ముప్పై ఆరు లక్షలు 36,00,000 సిఎస్ఆర్, నిధులతో నిర్మించిన స్కూల్ భవనం ఈ నెల 27 వ తేదీన ప్రారంభోత్సవం కు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ ని ఆహ్వానిస్తున్న కంపెనీ ప్రతినిధులు మరియు నాయకులు.

పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్లు మండల పరిషత్ ప్రాథమిక (కన్నడ మీడియం)పాఠశాను శనివారం మండల విద్యాధికారి ఎస్.ఎన్.శ్రీధర్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఇటీవల విద్యార్థులకు జరిగిన 3 మరియు 4పరీక్షా పత్రాలు ఆన్లైన్ మార్కుల ఎంట్రీని పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్ లను విద్యా సామర్థ్యాలను స్వయంగా పరిశీలించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు.

చలివేంద్రం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర- గోరంట్ల : శ్రీ సత్యసాయి జిల్లా. గోరంట్ల మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో పాలసముద్రం క్రాస్ నందు చలివేంద్రం ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గోరంట్ల సీఐ బోయ శేఖర్ పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు, అలాగే జనసేన పార్టీ మండల అధ్యక్షులు సంతోష్ కుమార్ జిల్లా కార్యదర్శి సురేష్ జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ కార్యక్రమాల కమిటీ పొగతోట వెంకటేష్ గొల్లపల్లి అనిల్ చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు రమేష్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు,వడిగేపల్లి మరియు పాలసముద్రం పంచాయతీ జనసేన పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు ,దేవుల చెరువు రమేష్ గొల్లపల్లి శివ మంజునాథ్ పాలసముద్రం మహేష్ రెడ్డి వజీర్ మనోహర్ మూర్తి గంగాధర్ బాబా చైతు శంకర్ సుధా రాజు గోపి హర్ష గిరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి : మంత్రి



విశాలాంధ్ర- పెనుకొండ : పెనుకొండ లోని క్యాంపు కార్యాలయంలో శనివారం సత్యసాయి జిల్లాలోని మహాత్మా జ్యోతిబా ఫూలే బి సి గురుకుల పాఠశాల కళాశాలల కన్వీనర్, కో-కన్వీనర్ ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించి, విద్యా సంస్థల్లో ఉన్న సమస్యలు పై ఆరా తీసి వాటికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని అలాగే గురుకుల పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచి నాణ్యమైన విద్యను విద్యార్థులు అభ్యసించే విధంగా అధికారులు బాధ్యత తీసుకోవాలని విద్యా సంవత్సరం నుంచి మరింత నాణ్యమైన విద్యను అందించడానికి అందరూ ప్రతిష్టమైన కృషి చేయాలని అధికారులను ఆదేశించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత మంత్రిని కలిసిన వారిలో ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్‌లు ఉన్నారు.

పాలిటెక్నిక్ పారిశ్రామిక వృద్ధిలో అగ్రస్థానం

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో పారిశ్రామిక వృద్ధిలో అగ్రస్థానంలో ఉందని రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎయిర్ ఫోర్స్ అథారిటీ జేటీ రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ జయచంద్ర రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులను దీటుగా ఎదుర్కొనే సన్నత విద్యార్థులలో మేదో వికాసం, పరిశోదాత్మక అధ్యయనాలు తోడ్పాటును అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, కేశవ చంద్రరావు రిటైర్డ్ ప్రిన్సిపల్, పూర్వ విద్యార్థులు, పాలిటెక్నికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో ఏడు మసీదులలో ముస్లిం సోదరులకు శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు టిడిపి సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ కుమారుడు పయ్యావుల విజయసింహ తో పాటు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, టిడిపి నాయకులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.